
కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వైభవంగా లక్ష దీపోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్ గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయకస్వామి ఆలయంలో శనివారం రాత్రి వైభవంగా లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి భక్తులు గాజులు, ఒడి బియ్యం సమర్పించారు. రాత్రి స్వామివారిని, అమ్మవార్లను ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో అలంకరించి ప్రత్యేక పూజలు, ఉయ్యాల సేవ, ఉంజిల్ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. లోక కల్యాణం కోసం దీపోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్తలు తెలిపారు.


స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

గజ వాహనంపై అనంతుడు

వికారాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయ ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. రెండో శనివారం సెలవు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున అనంతగిరికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని గజ వాహన సేవపై ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సైతం అనంతగిరికి భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో కమ్మేసిన మంచు



చలి.. గజగజ!

రాత్రి వేళల్లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

నిన్న మొన్నటి వరకు వదలని వర్షాలతో ఇబ్బందులు పడిన ప్రజలు.. ప్రస్తుతం చలికి గజగజ వణికిపోతున్నారు. కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. పగలు ఎండ ఉంటున్నప్పటికీ సాయంత్రం తరువాత చలిగాలుల తీవ్రత పెరుగుతోంది. తెల్లవారుజామున మంచు కురుస్తోంది. భిన్న వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జ్వరం, జలుబు, దగ్గు బారిపడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. శనివారం రాష్ట్రంలోనే రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 15 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదుకావడం గమనార్హం.



- ఉమ్మడి జిల్లాలో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు
- చందన్వెల్లి, తాళ్లపల్లిలో 14.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు
- సాయంత్రం నుంచి చలిగాలుల ఉధృతి
- బయటకు వచ్చేందుకు జంకుతున్న జనం
- రహదారులను కప్పేస్తున్న పొగమంచు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. గడిచిన రెండు, మూడు రోజులుగా వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. చలిగాలుల ఉధృతి పెరగడంతో అనేక ప్రాంతాల్లో ఈ ఏడాది కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 15 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శనివారం రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదుకావడం గమనార్హం. రంగారెడ్డిజిల్లా షాబాద్ మండలం చందన్వెల్లితో పాటు తాళ్లపల్లిలో 14.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మంచాల మండలం ఆరుట్లలో 14.9 డిగ్రీలు, షాబాద్, మొయినాబాద్‌లలో 15డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే వికారాబాద్ జిల్లాలోని మాడ్గుల చిట్టంపల్లి, పెద్దఉమ్మెంత్తల్, నవాబుపేట, మన్నెగూడలలో 14.8డిగ్రీలు కనిష్ఠ ఉష్ణోగ్రతలు

మిగతా 7వ పేజీలో...

ప్రతీ పౌరుడికి న్యాయం పొందే హక్కు


మాట్లాడుతున్న తిరుపతి

మేడ్చల్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): న్యాయంపై సమాజంలో అవగాహన కల్పించిన రోజే ప్రతి పౌరుడు న్యాయం పొందే హక్కు గురించి తెలుసుకోగలుగుతాడని మేడ్చల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ తిరుపతి అన్నారు. జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పడాల రామిరెడ్డి లా కాలేజీ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో నిర్వహించిన న్యాయ సేవా సదన్ లీగ్ ఎయిడ్ అండ్ అవేర్నెస్ కార్యక్రమానికి న్యాయమూర్తులు తిరుపతి, అలేఖ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి తిరుపతి మాట్లాడుతూ.. న్యాయం పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ప్రజల్లో న్యాయ వ్యవస్థ పట్ల నమ్మకం కలిగించేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పడాల శ్రీనివాస్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ విజయ కళ్యాణి, మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల తరలింపుపై
గళం విప్పాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య

కొడంగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల తరలింపునకు నిరసనగా కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పోరాటంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు గళం విప్పాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. లేని పక్షంలో వారి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. శనివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కొడంగల్ నుంచి విద్యాసంస్థల తరలింపును నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జీవో పత్రాలను దహనం చేశారు. మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేసేంత వరకూ పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్‌బాబు, భీమరాజు, డాక్టర్ నవాజ్, పవన్‌లాహోటి, రమేశ్‌బాబు, బుస్స చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖ ద్వారం


ఆద్యంతం.. ఆహ్లాదం

జానంపేట వేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలు

- 400 ఏళ్ల క్రితం నిర్మాణం.. కోర్కెలు నెరవేరుస్తున్న వెంకన్న
- గుడి సమీపంలో ఎటు చూసినా పచ్చదనం
- ఆకట్టుకునేలా కల్యాణ మండప నిర్మాణం
- నిత్యం స్వామివారి దర్శనానికి వందలాది మంది భక్తుల రాక

7

Sunday Special

విశాలమైన ప్రదేశం.. ప్రశాంతమైన వాతావరణం.. ఆధ్యాత్మికతతో ఆహ్వానించే గాలి గోపురం.. లోపలికి వెళ్లగానే ప్రకృతి అందాల పరవశం.. పచ్చని చెట్ల స్వాగతం.. ఇంతటి ఆహ్లాదాన్ని పంచుతుంది ఫరూఖ్‌నగర్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయం. 400 ఏళ్ల చరిత్ర గల ఈ గుడి ప్రాంగణంలోకి ప్రవేశించగానే సాక్షాత్తు ఆ వేంకటేశ్వరుడి దివ్య సుందర రూపం దర్శనం పొంది భక్తులు పరవశించి పోతారు. షాద్‌నగర్ పట్టణంలోని పాత జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ ఆలయాన్ని నిత్యం వందలాది మంది భక్తులు వచ్చి స్వామివారికి దర్శించుకుంటారు.


ఆలయ గోపురం

ఆర్చరీలో గురుకుల విద్యార్థినుల ప్రతిభ


మెడల్స్, సర్టిఫికెట్లతో విద్యార్థినులు

కీసర, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అంకిరెడ్డిపల్లి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చాటారు. మహబుబాబాద్‌లో నవంబరు 2, 3, 4 తేదీల్లో అండర్ 14, 17, 19 విభాగాల్లో రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో యు.వైష్ణవి, ఎ.పల్లవి, టి.రాణి, ఎ.చందర, పి.అక్షిత, ఎల్.శివాని, టి.జయశ్రీ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు డిసెంబరు 2న మణిపూర్‌లో జరిగే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రియాంక శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్చరీలో సత్తా చాటిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయురాలు రాజమణి అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.



ఘనంగా ఉర్సు

మేడ్చల్ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని హజ్రత్ జిందాషా మదర్‌బాబా ఉర్సును శనివారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. సందల్(గంధం), నషాన్(జెండా) చాదర్ తెచ్చి సమర్పించారు. అనంతరం ప్రార్థనలు చేశారు. కుల మతాలకు అతీతంగా పార్థనల్లో పాల్గొని దట్టీని సమర్పించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. మసీదు కమిటీ సభ్యులు జమాల్, ఇనాయత్ అలీ, లాయక్‌అలీ, ఖాలేద్, మహబూబ్ అలీ, అశ్రఫ్, ఆరిఫ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

- సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల డీసీవో సాయిలత
- వికారాబాద్‌లో ముగిసిన 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్

7

మృత్యు గుంతలు

ఇష్టానుసారంగా 15 నుంచి 20 అడుగుల లోతు తవ్వకాలు

- వర్షాలకు కుంటలను తలపిస్తున్న బొందలు
- గత నెలలో నీటి గుంతలో పడి మృతిచెందిన అక్కాచెల్లెలు
- ఇప్పటికీ ఘటనాస్థలాన్ని పరిశీలించని అధికారులు
- భారీ గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం


ప్రశాంత్‌నగర్‌లో ప్రమాదకరంగా గుంత


మృతి చెందిన హరిణి, గాయత్రి (ఫైల్)

ఘట్‌కేసర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా పలు చోట్ల ఇష్టానుసారంగా చేపట్టిన మట్టి తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు మృత్యుకుహరాలుగా మారాయి. మట్టికి డిమాండ్ ఉండడంతో ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేపడుతున్నారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో గతంలో పలుచోట్ల ఔటర్ నిర్మాణం కోసం చెరువులు, కుంటల్లో వంద అడుగుల లోతు వరకు తవ్వకాలు చేపట్టి చెరువులను బావులుగా మార్చారు. ఈ గుంతల్లో పడి అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఘట్‌కేసర్‌లోని ఔటర్ టోల్ ప్లాజా వద్ద గల బారీ క్రషర్ గుంత అనేక మందిని బలిగొంది. గత నెలలో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని చందుపట్లగూడ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో పశువులను

మిగతా 8వ పేజీలో...

గుంతలను పూడ్చివేయాలి

పెద్దఎత్తున లోతైన గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. ఇటీవల ఇద్దరు అక్కాచెల్లెలు గుంతలో పడి మృతి చెందడం బాధాకరం. నిత్యం పెద్దసంఖ్యలో జనాలు తిరిగే ప్రాంతాల్లో పెద్దపెద్ద గుంతలను అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలి. అలాగే మట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాలి.

- జంపాల రమేష్, మాజీ ఎంపీటీసీ ఎన్ఎఫ్‌సీనగర్

అక్రమంగా తరలిస్తున్న 66 పశువుల పట్టివేత


పోలీసుల అదుపులో ఆవులను తరలిస్తున్న కంటైనర్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గాలి, వెలుతురు తగలకుండా పశువులను తరలిస్తున్న ముగ్గురిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి లారీని సీజ్ చేశారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారి ఎదులాబాద్ అండర్‌పాస్ వద్ద వాహనాలు తనిఖీలో భాగంగా అశోక్ లేలాండ్ (టీఎస్ 15 యూఈ 8156)ను ఆపి సోదా చేశారు. లారీపై కప్పిన టార్పాలిన్ తీసి చూడగా గాలి, వెలుతురు ఆడకుండా, నీరు ఇవ్వకుండా అతి క్రూరంగా 31 ఆవులు, 35 ఎద్దులను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షామ్లా జిల్లా ఖొండకాకు చెందిన డ్రైవర్ ఇస్రాకర్(34) ఉత్తరాఖండ్, రూర్కీ, హరిద్వార్‌కు చెందిన గుల్షన్(24), ఉత్తరప్రదేశ్ కైలాస్‌పూర్‌కు చెందిన ఎండీ కలీమ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. విజయవాడ, హనుమాన్ జంక్షన్ సంతలో తమ యజమాని అఫ్రోజ్ సూచనల మేరకు ఆవులు, ఎద్దులను కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని బహదూర్‌పూర కబేళాకు తరలిస్తున్నట్లు చెప్పారు. లారీని సీజ్ చేసిన పోలీసులు పశువులను జియాగూడలోని గోశాలకు తరలించారు. అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లైంగికదాడి.. పోక్సో కేసు నమోదు

మోమిన్‌పేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలదరి శివారు అటవీ ప్రాంతంలో బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. లైంగికదాడికి పాల్పడిన రోషన్ అలీ వహీద్, అతడికి సహకరించిన నర్సిములుపై పోక్సో కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అరవింద్ తెలిపారు.



బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పేదలకు సేవ చేయడం అభినందనీయం

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సేవచేయడం అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ యువ నాయకుడు కేకే కృష్ణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన సందర్భంగా షాద్‌నగర్ పట్టణం పరిగి రోడ్డులో బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కొంకల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, అగ్గనూరి బస్వం, మహమ్మద్ ఇబ్రహీం, కరుణాకర్, సయ్యద్ ఖదీర్, అశోక్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పల్లె దవాఖాన వద్ద ఆందోళన నిర్వహిస్తున్న స్థానికులు

ఆశా వర్కర్ భర్త తీరుపై స్థానికుల ఆగ్రహం

ఘట్‌కేసర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అన్నోజిగూడలోని పల్లె దవాఖాన వద్ద వ్యాక్సినేషన్ కోసం వచ్చిన పిల్లల తల్లిదండ్రులతో దురుసుగా వ్యవహరించిన ఆశా వర్కర్ భర్త తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తల్లిదండ్రులు పిల్లలను పల్లె దవాఖానాకు తీసుకువచ్చారు. డాక్టర్ సెలవులో ఉండటంతో ఆశావర్కర్ ఒక్కరే ఉన్నారు. ప్రజలు తొందరపెట్టడంతో అక్కడే ఉన్న ఆశావర్కర్ భర్త తల్లిదండ్రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నువ్వు మమ్మల్ని బెదిరించడం ఏమిటని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడి ప్రవర్తనపై డీఎంహెచ్‌వో, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులొచ్చి సముదాయించి అందరినీ పంపించేశారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న లక్ష్మీనారాయణ

క్రీడలతో స్నేహభావం పెంపు

» సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

శంకర్‌పల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. చేకూరి సురేంద్ర విఠల్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రొద్దటూరులో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్ విఠల్ ఎంతో గొప్ప వ్యక్తి అని, స్నేహితులందరూ కలిసి ఆయన గుర్తుగా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. క్రీడలకు మాత్రమే పరిమితం కాకుండా ఇతర రంగాల్లోనూ రాణించాలని క్రీడాకారులకు సూచించారు. స్పాన్సర్స్ సుభిషి చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, సామాజిక కార్యక్రమాలను చేపట్టుతున్న వాణిలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సలీంపాష, ఉపాధ్యాయుడు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో విద్యార్థినులు

వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ(భువనగిరి) కళాశాలలో కృత్రిమ మేధస్సు, ఉపాధి నైపుణ్యాలపై నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్, మ్యాజిక్‌బస్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో జరిగిన వర్క్ షాప్‌లో 80 విద్యార్థినులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ శ్రీలత మాట్లాడుతూ.. విద్యార్థినులు ఇలాంటి వర్క్‌షాపుల్లో పాల్గొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఐదు రోజులు జరిగిన ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థినులు కెరీర్, కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలను నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, కెరీర్ గైడెన్స్‌సెల్ కో-ఆర్డినేటర్లు మమతారాణి, స్పందన, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

పరిగి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణ పరిధి ఐదో వార్డు తిరుమల వెంచర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలిపోతున్నది. దిమ్మె పక్కనే బాయి గుంత ఉండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోతున్నారు. దిమ్మెకూలిపోవడం, పక్కనే నీటి గుంత ఉండడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని జంకుతున్నారు. మనుషులు, పశువులకు ముప్పు పొంచి ఉందని అంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కొత్త దిమ్మె నిర్మించాలని వాలనీవాసులు కోరుతున్నారు.



కూలుతున్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

చలి.. గజగజ!

(ఐదో పేజీ తరువాయి)

నమోదయ్యాయి. అలాగే మేడ్చల్ ఇండస్ట్రియల్ ఏరియాలో 15.6 డిగ్రీల, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్‌లో 15.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యాయి. అలాగే రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు కూడా క్రమేపీ తగ్గుతున్నాయి. మూడు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు అన్ని మండలాల్లో 28 నుంచి 30 డిగ్రీలలోపుగానే నమోదవుతున్నాయి. రాబోయే రోజుల్లో చలి తీవ్రత ఇంకా మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. పగలు ఎండ ఉంటున్నప్పటికీ సాయంత్రం తరువాత చలిగాలులు తీవ్రత పెరుగుతోంది. దీంతో రాత్రివేళ బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. రాత్రి పూట రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. తెల్లవారుజామున మంచు కురుస్తోంది. దీంతో ఉదయం 8గంటలకు కూడా కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కనిపిస్తుంది. రోడ్లపై పొగమంచు కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సీజన్ ఆరంభంలోనే చలి వణికిస్తుండడంతో రాబోయే రోజులు ఎలా



ఉంటాయోనని జనం ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా నగర శివార్లలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చలిని తట్టుకునే దుస్తులను ధరిస్తున్నారు. దీంతో మార్కెట్లలో స్వెటర్‌లు, జర్కిన్లు, మంకీ క్యాప్‌లు, దుప్పట్ల కొనుగోళ్లు మొదలయ్యాయి. చలి తీవ్రత పెరగడంతో జ్వరం, జలుబు, దగ్గున బారిపడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

కొడంగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ శివారులోని సిద్ధనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. 111వ వారం పూర్తయిన సందర్భంగా శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో హిందు వాహిని సభ్యులు, యువకులు పాల్గొన్నారు.



సిద్ధనొంపు ఆలయంలో భక్తుల పూజలు

ఆద్యంతం.. ఆహ్లాదం



స్వామి వారి కల్యాణమండపం

షాద్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అప్పటి వనపర్తి సంస్థానం రాజు నవయ్ వెంకట్‌రాంరెడ్డి భక్తుల కోసం 1692 సంవత్సరంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. స్వామివారి ధూపదీప నైవేద్యం కోసం ఆలయానికి సుమారు 42 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. సుమారు ఐదెకరాల్లో సువిశాల ప్రదేశంలో ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. అప్పట్లోనే స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు వచ్చేవారు. కానీ కాలక్రమేణ ఆలయానికి కేటాయించిన భూములు అన్యాక్రాంతం కావడం, ఆలనాపాలన కరువవ్వడంతో ఆలయ గర్భగుడి మినహా, మిగితా కట్టడాలన్నీ శిథిలావస్థతకు చేరుకున్నాయి. దీంతో ఆలయం మొత్తం దుర్గంధభరితంగా మారడం, ధూపదీప నైవేద్యాలకు కూడా కష్టంగా మారడంతో కొందరు స్థానికులు ఆలయ దుస్థితిపై ఎండోమెంట్ అధికారులకు వివరించారు. ఆ తర్వాత ఈ ఆలయాన్ని ఎండోమెంట్ పరిధిలోకి తీసుకువచ్చి ధూపదీప నైవేద్యాలకు సరిపడేలా చర్యలు తీసుకున్నారే తప్ప అభివృద్ధి కోసం పైసా కూడా కేటాయించలేదు.

1997లో పూర్వ వైభవం

అప్పట్లో షాద్‌నగర్ ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి బక్కని నర్సింహులు షాద్‌నగర్ అసెంబ్లీ నుంచి గెలుపొందారు. అనంతరం ఆయన 1997లో తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. అనంతరం ఆయన షాద్‌నగర్ పట్టణ అభివృద్ధితో పాటు ఆలయ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయానికి పూర్వవైభవం తెచ్చేందుకు గాను 1998లో టీటీడీ ఆగమశాస్త్ర సలహాదారుడు శ్రీనివాస భట్టాచార్యను ఆలయానికి ఆహ్వానించారు. ఆలయాన్ని పూర్తిగా పరిశీలించిన ఆయన స్వామివారి విగ్రహం, స్వామివారి మూల విరాట్‌లు గరుడ, ఆంజనేయ స్వామి విగ్రహాలను మార్చాలని సూచించారు. అనంతరం తిరుమల నుంచి స్వామి వారి కొత్త విగ్రహం, చైన్నై నుంచి గరుడ, ఆంజనేయ స్వామిల విగ్రహాలను తెప్పించి ఆలయానికి కొత్త శోభను తేవడంతో పాటు, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అప్పటి నుంచి భక్తుల తాకిడి మొదలైంది.



విరాళాలు అందజేస్తున్న భక్తులు (ఫైల్)

రూ.8 కోట్లతో ఆలయ అభివృద్ధి

ఆలయాన్ని మరింత ఆహ్లాదభరితంగా మార్చేందుకు కంకణం కట్టుకున్న అప్పటి ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆలయ అభివృద్ధి కోసం భక్తుల నుంచి సుమారు రూ. 8 కోట్ల విరాళాలు సేకరించి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఆలయానికి కేటాయించిన 42 ఎకరాల్లో కొంత స్థలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, తహసీల్దార్ కార్యాలయాలు నిర్మించగా, మిగతా స్థలం అన్యాక్రాంతమైంది. మిగిలిన 5ఎకరాల స్థలం చుట్టూ భారీ ప్రహరీ నిర్మించారు. ఆలయంలో స్వామి కల్యాణం నిర్వహిం చేందుకు సుందరమైన కల్యాణ మంటపం, చక్కటి ఆకారంలో పుష్కరణి, అరటి, పూల మొక్కలను పెంచి శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం సాధారణ రోజుల్లో వందలాది మంది, శని, ఆదివారాల్లో వేలాది మంది స్వామివారిని దర్శించుకోవడానికి రావడం విశేశం.

ఆలయాలను సంరక్షించుకోవాలి



ఎంతో చరిత్ర గల ఆలయాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉంది. భావితరాలు ఇలాంటి ఆలయాలను చూసి గర్వపడుతారు. భక్తులు తమకు తోచినంత విరాళాలు అందజేయడంతోనే శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని అభివృద్ధి చేశాం. ఇంకా ఎంతో అభివృద్ధి పర్చాల్సిన అవసరం ఉంది. త్వరలోనే ఆలయంలో భక్తుల సౌకర్యార్థం మరిన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం.

బక్కని నర్సింహులు, మాజీ ఎమ్మెల్యే, షాద్‌నగర్

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

» టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డితో యువకులు

ఆమనగల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సేవ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో యువత ముందుండాలని టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. యువశక్తి దేశానికి గొప్ప నిధి అని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన సుంకిరెడ్డిని శనివారం కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలువురు యువకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఐక్యత ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో అందిస్తున్న వైద్య, ప్రజా సేవా కార్యక్రమాలను హర్షిస్తూ పూలమాలలు, శాలువాలతో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ యువత శక్తియుక్తులపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ఐక్యత ఫౌండేషన్ సేవలు కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతీ గడపకు చేరవేస్తామని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, కల్వకుర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ఫౌండేషన్ లక్ష్యమన్నారు. మొబైల్ హెల్త్ క్యాంపుల ద్వారా నియోజకవర్గంలో లక్ష మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు

ఆమనగల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో ప్రజలు కష్టాల నుంచి వైదొలిగి ఆనందంగా ఉంటే విపక్షాలు జీర్ణించుకోలేక ప్రభుత్వంపై విష ప్రచారానికి ఒడిగట్టాయని మండిపడ్డారు. ఆమనగల్లు, కల్వకుర్తి, కడ్తాల్, మాడ్గుల, వెల్దండ, తలకొండపల్లి మండలాల నాయకులతో కలిసి శనివారం జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యూసుఫ్‌గూడలో పలు కాలనీల్లో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. జూబ్లీహిల్స్‌లో ఓటమిని ముందుగానే గ్రహించిన బీఆర్ఎస్, బీజేపీలు అవినీతి సొమ్ముతో ప్రజలను మభ్యపెట్టేందుకు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు బట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు భాస్కర్ రెడ్డి, మంగ్లీ రాములు, గుర్రం కేశవులు, సూదిని కొండల్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, పాలకుర్ల రాములు, జక్కు అనంత్‌రెడ్డి, జగన్, మానయ్య, ప్రభాకర్‌రెడ్డి, కాసు శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, రమేశ్‌యాదవ్, యాదయ్య, కాలె మల్లయ్య, చేగురి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : ప్రచారంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లేశ్

జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్‌దే గెలుపు

కందుకూరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్‌యాదవ్ గెలుపునకు ఉపయోగపడుతాయని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, సభ్యులు దేప భాస్కర్‌రెడ్డిలు ధీమా వ్యక్తం చేశారు. సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో నిర్వహించిన ప్రచారంలో వారు పాల్గొన్నారు. మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, ప్యాక్స్ మాజీ చైర్మన్ ఎస్.మల్లేశ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఎస్ జగన్, సమత, శ్రీనునాయక్, డి.నర్సింహాచారి, పాండుగౌడ్, వెంకటేష్, పాండురంగారెడ్డి, బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

బస్సు ప్రమాద బాధితులకు చేయూత

చేవెళ్ల/యాలాల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆర్టీసీ బస్సు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన హాజీపూర్ గ్రామ అక్కచెల్లెళ్లకు ఓ మాజీ సర్పంచ్, యువ నాయకుడు చేయూతనందించారు. చేవెళ్ల మండలం గొల్లపల్లి మాజీ సర్పంచ్ లొంక శ్రీనివాస్‌గౌడ్, యువ నాయకుడు కందికొండ విగ్నేష్‌గౌడ్‌లు తమవంతు సాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. మీర్జాగూడ రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతిచెందగా.. అందులో యాలాల మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన భార్యభర్తలు బందెప్ప, లక్ష్మీ మృతి చెందారు. దాంతో వారి ఇద్దరు కూతుళ్లు శివలీల, భవాణీలు అనాథలుగా మారారు. ఈమేరకు శనివారం గ్రామానికి చేరుకుని అక్కాచెల్లెళ్ల కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్‌గౌడ్ రూ.లక్ష, విఘ్నేష్‌గౌడ్ రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే రెండు నెలలకు సరిపడా క్వింటాల్ బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. మాజీ సర్పంచ్ జహంగీర్, నాయకులు మహేష్‌గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

» సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల డీసీవో సాయిలత

» వికారాబాద్‌లో ముగిసిన 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీవో సాయిలత



ఓవరాల్ చాంపియన్‌షిప్ కప్పులు అందుకుంటున్న క్రీడాకారులు

వికారాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆకాశమే హద్దుగా తమ జీవిత లక్ష్యాల సాధనకు పాటుపడాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల డీసీవో సాయిలత పిలుపునిచ్చారు. మూడు రోజులుగా అనంతగిరిపల్లిలోని బాలుర గురుకుల విద్యాలయం-శివారెడ్డిపేటలో జరిగిన జోనల్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి సాయిలత హాజరై మాట్లాడారు. కళాశాల స్థాయి నుంచే లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఉన్నత చదువులు చదువుకోవాలన్నా.. క్రీడాకారులుగా ఎదగాలని, లక్ష్యం సాధించే వరకు విశ్రమించకూడదని తెలిపారు. ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులకు మంచిపేరు తెచ్చేలా కృషిచేయాలన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేలా శ్రమించాలని అన్నారు. అంతకు ముందు క్రీడాకారులు పరేడ్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, పీడీలు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

జోనల్ స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో చిల్కూర్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. అండర్-17 విభాగంలో ఇబ్రహీంపట్నం, అండర్-19 విభాగంలో పరిగి విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. అండర్-14 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో ఎం.వినయకుమార్(పెద్దేముల్) ప్రథమ స్థానంలో, సీహెచ్.ఉదయ్‌కుమార్(శంషాబాద్) ద్వితీయ, జి.ప్రవీణ్ (ఇబ్రహీం పట్నం) తృతీయ స్థానాలు సాధించారు. హైజంప్‌లో ఎం.విశాల్(పెద్దేముల్) ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, సీహెచ్.సుశాంత్(శంషాబాద్) ద్వితీయ, ఉమేష్(కొందుర్గు) తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్-17 విభాగంలో బి.మహేందర్ (శివారెడ్డిపేట) ప్రథమ స్థానంలో నిలవగా, కె.ప్రకాశ్(పెద్దేముల్) ద్వితీయ, మధు(ఇబ్రహీంపట్నం) తృతీయస్థానాలు పొందారు. హైజంప్‌లో రోహిత్(పరిగి) ప్రథమ, టి.చందు(పెద్దేముల్) ద్వితీయ, పి.ప్రశాంత్(శంషాబాద్) తృతీయ స్థానాల్లో నిలిచారు. 400మీటర్ల రిలేలో పరిగి స్కూల్ ప్రథమ, గౌలుదొడ్డి ద్వితీయ, పెద్దేముల్ స్కూల్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-19 విభాగంలో వి.బన్నీ(ఇబ్రహీంపట్నం) ప్రథమ స్థానంలో నిలువగా, ద్వితీయ స్థానంలో కె.ప్రకాష్(పెద్దేముల్), తృతీయ స్థానంలో చంద్రశేఖర్(శంషాబాద్) నిలిచారు. హైజంప్‌లో ఎ.సత్యనారాయణ(శివారెడ్డిపేట) ప్రథమ, జి.శివప్రసాద్(పెద్దేముల్) ద్వితీయ, భీంరావు(చిల్కూరు)తృతీయ స్థానాల్లో నిలిచారు. 400మీటర్ల రిలే అండర్-19 విభాగంలో ఇబ్రహీంపట్నం ప్రథమ, పెద్దేముల్ ద్వితీయ, చిల్కూరు తృతీయ స్థానాల్లో నిలిచాయి.

కిష్టాపూర్ గురుకుల పాఠశాలలో..

మేడ్చల్ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని కిష్టాపూర్ బాలికల గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా కొనసాగుతున్న జోనల్ స్థాయి ఆటల పోటీలు శనివారం ముగిశాయి. హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ అధికారి నిర్మల, గురుకుల ప్రిన్సిపాల్ లలిత పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు


మేడ్చల్ టౌన్: గౌడవెల్లిలో పిల్లలతో కలిసి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న హరివర్ధన్‌రెడ్డి


వికారాబాద్: క్యాంప్ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ పట్టణ నాయకులు

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు.. సేవా కార్యక్రమాల నిర్వహణ


కొడంగల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి


మేడ్చల్ టౌన్ : మేడ్చల్‌లో కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో నాయకులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తన స్వగ్రామం గౌడవెల్లిలోని కృషి హోమ్స్‌లో నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. మేడ్చల్‌లో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్‌యాదవ్, ఎల్లంపేటలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు విగ్నేశ్వర్‌రెడ్డిలు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమాల్లో మూడు మునిసిపాలిటీల నాయకులు బి.ఈశ్వర్, మల్లేష్, పోచయ్య, సంజీవరావు, రమణారెడ్డి,సంతోష్‌గౌడ్, కౌడె


మర్పల్లిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మహేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ధారూరులో నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిలు నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు.

పెద్దేముల్: మండలంలో సీఎం పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పెద్దేముల్, తింసన్‌పల్లి గ్రామాల్లో నాయకులు కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో న్యాయవాది ఎల్లారెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, డీపై.నర్సిములు, నయాంబాబు, పెంటయ్య, తింసన్‌పల్లిలో అనీఫ్, పల్లె రవి, శ్రీనివాస్, నగేష్, వెకంటయ్య తదితరులు పాల్గొన్నారు.


బొంరాస్‌పేట్: తుంకిమెట్లలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ధారూరులో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కీసర:రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా కీసర చౌరస్తాలో రేవంత్‌రెడ్డిరెడ్డి చిత్ర పటం వద్ద నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

మర్పల్లి: మర్పల్లి మండలంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

కొడంగల్: రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కొడంగల్ నియోజకవర్గ బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, కొడంగల్ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. కొడంగల్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసిఫ్ ఖాన్, మునీర్, శ్రీకాంత్, ముఖీద్ పాల్గొన్నారు. మండల కేంద్రాల్లో నాయకులు, కార్యకర్తలు కేక్‌ను కట్ చేసి సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ సీనియర్ నాయకులు వేమారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి రేవంత్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాబు, మల్లయ్య, సురేశ్, రాములు, వేమారెడ్డి, శ్రీనివాసచారి, బాగ్దాద్, రవి, బందెయ్య, రామకృష్ణారెడ్డి, గిరిసింగ్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నర్సింహారెడ్డి, శేఖర్, శంకరప్ప, మహంత్ స్వామి, నర్సిములు, చంద్రయ్య, గోపాల్ పాల్గొన్నారు.

వికారాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్‌చేసిన అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాంప్ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్ నాయక్, చిగుళ్లపల్లి రమేష్, ఎర్రవల్లి జాఫర్, అనంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రెడ్యానాయక్, శివయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

బంట్వారం: బంట్వారం, మండల పరిధి గ్రామాల్లో కాం గ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కస్తూర్బా గురుకుల పాఠశాలలో, ఆసుపత్రిలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం,యాదగిరి, నర్సింలు, రంగారెడ్డి, శివకుమార్, నర్సింహారెడ్డి, వీరేశం, ప్రభాకర్, నూర్లంపల్లి నర్సిములు, తౌఫిక్‌పాషా, పురుషోత్తంరెడ్డి, మహేశ్, హర్షవర్ధన్‌రెడ్డి, అజీమ్, సిద్దిరాములుస్వామి పాల్గొన్నారు.

నవాబుపేట:నవాబుపేటలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పోలీసు రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాథోడ్ గీతాసింగ్, నాయకులు కందాడ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎండీ.ఖదీర్, సీహెచ్.లింగం, వెంకటేశం, రాములు, ధర్మయ్య పాల్గొన్నారు.


మోమిన్‌పేట్‌లో రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు


పెద్దేముల్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


కీసరలో రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలో కాంగ్రెస్ నాయకులు


మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లిలో కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్‌యాదవ్


సిరిపురం సమీపంలో గుంతలు పూడ్చివేస్తున్న ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు

రోడ్డుపై గుంతల పూడ్చివేత

మర్పల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చేవేళ్ల రోడ్డు ప్రమాదం సంఘటన నేపథ్యంలో రోడ్డుపై పడిన గుంతలను ఆటో యూనియన్ నాయకులు పూడ్చివేశారు. సొంత డబ్బులతో సిరిపురం నుంచి మోమిన్‌పేట్ వరకు గుంతలుగా మారిన రోడ్డుపై గ్రామానికి చెందిన అనంతయ్య రూ.20వేలు ఖర్చు చేసి ఆటో యూనియన్ సభ్యులతో కలిసి రోడ్డు మరమ్మతులు చేపట్టారు. రోడ్డుపై గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. గుంతలమయంగా మారిన రోడ్డుపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురి కావడంతో ఆటో యూనియన్ నాయకుల సహకారంతో గుంతలను పూడ్చినట్టు అనంతయ్య తెలిపారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భగవద్గీత పోటీలు



భగవద్గీత కంఠస్త పోటీల్లో పాల్గొన్న సాధు పరిషత్ అధ్యక్షుడు శంకర్‌స్వామి

తాండూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తాండూరు విశ్వహిందూపరిషత్ నగర శాఖ ఆధ్వర్యంలో శనివారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ మార్గదర్శక మండలి సభ్యులు తెలంగాణ సాధుపరిషత్ అధ్యక్షుడు శంకర్‌స్వామీజీ, పాలమూర్ విభాగ్ ధర్మాచార్య ప్రముఖ్ సుభాష్‌రెడ్డి, వీహెచ్‌పీ సామాజిక తొలి సభ్యులు బస్వరాజ్, జిల్లా ప్రముఖ్ శ్రీశైలం పాల్గొన్నారు. కళాశాల స్థాయిలో సిద్ధార్థ కళాశాల విద్యార్థి సాయిరాం, చైతన్య కళాశాల విద్యార్థిని అనూష ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. హైస్కూల్ స్థాయిలో నేతాజి గురుదేవ్ గురుకుల్ పాఠశాల విద్యార్థిని మోక్ష ప్రథమ, కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థిని వర్షినిరెడ్డి ద్వితీయ స్థానం సాధించారు. 6, 7వ తరగతుల విభాగంలో కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి కార్తికేయ ప్రథమ, నేతాజీ గురుకుల్ విద్యార్థిని వైష్ణవి ద్వితీయ స్థానం పొందారు. 3, 4, 5వ తరగతుల విభాగంలో కృష్ణవేణి కాన్సెప్ట్ విద్యార్థి ఆశ్రిత ప్రథమ, సరస్వతీ శిశు మందిర్ విద్యార్థిని శరణ్య ద్వితీయ స్థానం పొందారు. శిశు నుంచి 2వ తరగతి వరకు నేతాజీ విద్యార్థిని ఆధ్యశ్రీ ప్రథమ , కేరళ మోడల్ స్కూల్ విద్యార్థిని ఆప్ర ద్వితీయ స్థానం సాధించారు.

బాసర కవి సమ్మేళనంలో
తాండూరు కవులు

తాండూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంత సాహిత్య వేదిక వికారాబాద్ ఆధ్వర్యంలో బాసర కవియాత్ర-2025 సంవత్సరం నవంబరు 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన కవి సమ్మేళన కార్యక్రమంలో తాండూరు కవి కోటం చంద్రశేఖర్ కార్యక్రమం సమన్వయకర్తగా వ్యవహరించారు. బాసరలోని ఆర్యవైశ్య యాత్రి నివాస్ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 9న జరిగే పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంలో రైతన్య శతకం(మణిపూసల) సభాధ్యక్షుడిగా తాండూరుకు చెందిన కవి వడిచర్ల సత్యం వ్యవహరిస్తారు.

ఘనంగా జగదాంబ మాత విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు నిర్వహిస్తున్న బంజారాలు

ఘట్ కేసర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బంజారాల దైవం జగదాంబ మాత, గురువు సేవాలాల్‌ల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శనివారం అన్నోజిగూడలో ప్రారంభమయ్యాయి. ఇక్కడ నూతన ఆలయాన్ని నిర్మించారు. దీక్షాధారణ, మంటపారాధన, అఖండ దీపస్థాపన పూజల అనంతరం ఉదయం నుంచి సాయంత్రం వరకు హోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను ఊరేగించారు. సోమవారం జగదాంబ మాత, సేవాలాల్ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గోర్ బంజారా సంఘం ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో బిక్కునాయక్, జితేందర్‌నాయక్, రెడ్డియా నాయక్, తౌర్యనాయక్, రాంసింగ్, తార్‌సింగ్, రమేష్ ఆలయ స్లాబ్ నిర్మాణ దాత రవీందర్‌రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం, సంక్షేమానికి
ప్రభుత్వం కట్టుబడి ఉంది


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బంట్వారం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని బంట్వారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచారం వెంకటేశం అన్నారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు సుక్క లక్ష్మికి మంజూరైన రూ.1.28లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అవసరమున్న ప్రతీ ఒక్కరికి సాయం అందించేందుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరేశం, నూర్లంపల్లి నర్సిములు, తౌఫిక్ పాషా, సిద్ధిరాములు స్వామి, ప్రభాకర్, అజీమ్, సుధాకర్, రాధాకృష్ణగౌడ్ ,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ గురుకుల విద్యార్థుల ప్రతిభ


బహుమతులు సాధించిన కొడంగల్ విద్యార్థులు

కొడంగల్ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని అనంతగిరిపల్లి బాలుర గురుకుల విద్యాలయం-శివారెడ్డిపేటలో జరిగిన జోనల్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ఈ మీట్‌లో కొడంగల్ సంక్షేమ గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 5 కిలో మీటర్ల, 800మీటర్ల పరుగు పందెంలో బి.నవీన్‌కుమార్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అండర్-17 క్యారమ్స్‌లో మేఘనాథ్, కిరణ్ ఫస్ట్ ప్రైజ్ సాధించారు. లాంగ్ జంప్‌లో లక్ష్మణ్, సారథి ద్వితీయ బహుమతి, అండర్-17 డిస్కస్ త్రోలో ప్రకాశ్ ద్వితీయ, ఫుట్‌బాల్ అండర్-19లో ద్వితీయ బహుమతి సాధించాడు. విద్యార్థులను గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ రామదాసు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు
దుస్తుల పంపిణీ


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అనిత

తాండూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు రాజీవ్ కాలనీలో పనిచేస్తున్న జవాన్ అశోక్‌తోపాటు మరో 10 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. తాండూరు పట్టణ బీసీ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు అనిత ప్రతీ సంవత్సరం మాదిరిగానే వారితో కలిసి భోజనం చేస్తూ అనంతరం దుస్తులను పంపిణీ చేశారు. ప్రతీ కార్తీక మాసం కార్మికులకు అనిత ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

ఇరుకు రోడ్డుతో అవస్థలు



బషీరాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు

బషీరాబాద్, నవంబరు8(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ కూడలి రోడ్డులో బస్సులు,ప్రైవేటు వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డు పక్కన స్థలాన్ని అక్రమించుకోడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్ల మధ్యే నిలుస్తున్న మురుగు

పరిగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరిగి మునిసిపల్ మూడో వార్డు సాయిరాంనగర్ కాలనీలో రోడ్లపై పారుతున్న మురుగు నీటితో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ లీకేజీతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. పదిహేను రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉంది. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మురుగు తొలగించాలని కోరుతున్నారు.


ఇళ్ల మధ్య పారుతున్న మురుగు నీరు

ఉపాధిలో అక్రమాలకు చెక్!

- ఫొటో సరిపోలితేనే హాజరు
- కొనసాగుతున్న కూలీల ఈ-కేవైసీ ప్రక్రియ


ఉపాధి కూలీల ఫొటో తీస్తున్న సిబ్బంది

బషీరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో నకిలీలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఒక కూలీ బదులు మరొకరు పనులకు వెళ్లడం, పనిచేయకుండానే వేతనాలు పొందడం వంటి అక్రమాలు తనిఖీల్లో బయటపడుతున్నాయి. పలుచోట్ల స్థానిక నాయకుల బంధువులు, క్షేత్ర సహాయకుల కుటుంబీకులు పనులకు వెళ్లినట్టు మస్టర్లలో రికార్డు చేస్తున్నారు. ఈ క్రమంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కూలీలకు ఈ-కేవైసీ చేస్తోంది.

ఏం జరుగుతోందంటే..

కూలీలు పనులకు వెళ్లినప్పుడు క్షేత్రసహాయకులు ఫొటో తీస్తారు. పనులు చేసిన నాలుగు గంటల తర్వాత మరో ఫొటో తీసి నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. కానీ కొన్ని చోట్ల నకిలీ ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికొచ్చింది. దీనికి చెక్ పెట్టేందుకు ప్రస్తుతం కూలీల ఈ-కేవైసీ చేస్తున్నారు. ఈ విధానంలో యాప్‌లో అప్‌లోడ్ చేసే ఫొటోలు ఒకేలా ఉండి కూలీల ఈ-కేవైసీ సరిపోతేనే ఇకపై హాజరు పడనుంది. తర్వాతే కూలీలకు వేతనాలు మంజూరవుతాయి.

80శాతం ఈ-కేవైసీ పూర్తి

మండల వ్యాప్తంగా 16,694 మంది కూలీలు పేస్లు నమోదు చేసుకున్నారు. వారిలో 10,694 మంది మాత్రం పనులకు వస్తున్నారు. వీరిలో 8,385 మంది కూలీల ఈ-కేవైసీ ఇప్పటికే పూర్తయింది. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను తొలగిస్తున్నాం. వందశాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో క్షేత్ర సహాయకులు గ్రామాల్లో ముమ్మరంగా ఈ-కేవైసీ ప్రక్రియను చేపడుతున్నారు. క్షేత్ర సహాయకులు పూర్తి విచారణ జరుపకుండా కూలీల పేర్లను తొలగిస్తే వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

- శారద, ఏపీవో బషీరాబాద్

మృత్యు గుంతలు


ఘట్‌కేసర్ ఔటర్ టోల్‌ప్లాజా వద్ద లోతైన క్వారీ గుంత

(5వ పేజీ తరువాయి)

మేపేందుకు వెళ్లిన హరిణి (16), గాయత్రి (13) అక్కాచెల్లెళ్లు నీటి గుంతలో పడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటికీ ఘటనా స్థలాన్ని సంబంధిత అధికారులు పరిశీలించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

భూ యజమానికి నోటీసులిస్తాం



మున్సిపాలిటీ పరిధిలోని చందుపట్లగూడ రెవెన్యూలోని ప్రైవేట్ స్థలంలో పెద్దఎత్తున గుంతలు ఉన్న విషయాన్ని గుర్తించాం. అందులోని ఓ గుంతలో ఇద్దరు బాలికలు పడి మృతి చెందడం బాధాకరం. అక్రమంగా గుంతలు తవ్వి వదిలేయండంపై స్థల యాజమానిని గుర్తించి నోటీసులు జారీచేస్తాం. ప్రజలు సైతం జాగ్రత్తగా ఉండాలి.

- రాజేశ్, మున్సిపల్ కమిషనర్, ఘట్‌కేసర్

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

చందుపట్లగూడ రెవెన్యూలోని ప్రశాంత్‌నగర్ పక్కన ఖాళీ స్థలంలో గతంలో పెద్దఎత్తున మట్టి తవ్వకాలు చేపట్టారు. దాదాపు 15 నుంచి 20 అడుగుల మేర తవ్వి వదిలేశారు. దీంతో వర్షాలకు ఆ గుంతలు నిండి బావులను తలపిస్తున్నాయి. ఇలా ఈ ప్రాంతంలో అనేక లోతైన మడుగులు ఏర్పడ్డాయి. ఇక్కడ అక్రమంగా మట్టి తవ్వకాలు జరిగినట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరు తవ్వకాలు చేపట్టినా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కాచెల్లెలు మృతి చెందిన మడుగు సమీపంలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆయా రంగాలకు చెందిన కార్మికులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి వస్తుంటారు. ఏమాత్రం కాలు జారినా అనంతలోకాలకే.. ఘట్‌కేసర్‌లోని టోల్‌ప్లాజా సమీపంలో భారీ క్వారీ గుంతలో అనేక మంది పడి మృతి చెందిన సంఘటనలున్నాయి. ఇటీవల పోలీసులు అక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టి సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



అనేక ప్రమాదాల్లో మృతి చెందిన వారికి చెల్లిస్తున్నట్లుగానే నీటి ప్రమాదాల్లో మృతి చెందిన వారికి సైతం ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి. ఎక్కడ మట్టితవ్వకాలు చేపట్టినా మున్సిపల్, గ్రామ పంచాయతీలు, రెవెన్యూ అధికారులు గ్రామ సభలు పెట్టి జనాలకు తెలపాలి. దీంతో అక్కడ గుంతలు ఉన్న విషయం అందరికీ తెలుస్తుంది. గుంతలో పడి మృతి చెందిన అక్కాచెల్లెళ్ల మృతిపై విచారణ చేపట్టాలి.

- దొంతి నర్సింహారెడ్డి, పర్యావరణవేత్త

రిజర్వేషన్ సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

వికారాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 42శాతం రిజర్వేషన్ సాధన కోసం బీసీ సంఘాలు ఐక్యంగా ముందుకురావాలని బీసీ జేఏసీ నాయకులు గుడిసె లక్ష్మణ్, యాదగిరి అన్నారు. శనివారం వికారాబాద్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఈ నెల 22న బీసీ సంఘాల సమావేశం నిర్వస్తామని, జిల్లాలోని అన్ని బీసీ సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, శివరాజ్, అంజయ్య, మారుతి, బుచ్చిబాబు గౌడ్, వెంకటేశ్, లక్ష్మణ్, ఉమాశేఖర్, సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.


బీసీ జేఏసీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు